వాయిస్ అఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం – మననేత్రం
Follow
పేజీలు 10
సోమవారం , డిసెంబరు 8, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## చీఫ్ జస్టిస్ కొడుక్కి.. కూలీ కొడుక్కి ఒకే న్యాయమా?: మాజీ సీజేఐ గవాయ్



- ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ వర్తింపజేయాలన్న మాజీ సీజేఐ గవాయ్
- తన తీర్పుపై సొంత వర్గం నుంచే విమర్శలు ఎదుర్కొన్నానని వెల్లడి
- సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జి పదవులకు రిజర్వేషన్లు ఉండవని స్పష్టీకరణ
- రిజర్వేషన్ ఫలాలు నిజమైన అర్హులకే చేరాలన్నదే తన ఉద్దేశమని వ్యాఖ్య
- అదే అంబేడ్కర్ అసలైన ఆశయమని అభిప్రాయం

## గోవా నైట్‌క్లబ్‌లో భయానక అగ్నిప్రమాదం



## 25 మంది దుర్మరణం

- అర్ధరాత్రి బిర్చ్ నైట్‌క్లబ్‌లో ఒక్కసారిగా అగ్ని కాళరాత్రి
- బాణసంచా పేలుడుతో క్షణాల్లో మంటలు హాలు మొత్తాన్ని చుట్టుముట్టాయి
- ఇరుకు దారులతో బయటకు రాలేక బాధితులకి చిక్కుబండవు
- బేస్‌మెంట్‌లో ఊపిరాడక పలువురు మృతి చెందిన విషాదకర దృశ్యం
- మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బంది
- క్లబ్ యజమానులు, మేనేజర్‌పై క్రిమినల్ కేసులు - సర్పంచ్ అరెస్ట్
- గోవా ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- భద్రతా నిబంధనలు గాలికి వదిలి నిర్వహించిన క్లబ్‌పై తీవ్ర ఆరోపణలు

గోవాలోని అర్పోరా–నగావ్ గ్రామంలో అర్పోరా నది ఒడ్డున ఉన్న బిర్చ్ బై రోమియో లేన్ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 25 మంది దురదృష్టకరంగా మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. క్లబ్‌లో ఒక్కసారిగా పెద్దపీట పేలుడు వినిపించడంతో క్షణాల్లోనే మంటలు హాలు మొత్తాన్ని చుట్టుముట్టాయి. డ్యాన్స్ హాల్‌లో దాదాపు వందమంది ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో పరిస్థితి తీవ్రాందోళనకరంగా మారింది. మంటల్లో చిక్కుకుని కొందరు, దట్టమైన పొగతో ఊపిరాడక మరికొందరు మృతి చెందారు. మృతుల్లో

(మిగతా 2వ పేజీలో)





## డిసెంబర్ 9ను 'విజయ్ దివస్' ఘనంగా జరపాలి: కేటీఆర్

- తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కీలక రోజు డిసెంబర్ 9
- ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనే కార్యక్రమాలు నిర్వహించాలి
- 60 ఏళ్ల తెలంగాణ ఆశలకు రూపం వచ్చిన రోజు ఇదే: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నిర్మాణ యాత్రలో అత్యంత కీలకమైన రోజైన డిసెంబర్ 9ను 'విజయ్ దివస్'గా అత్యంత ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన ఈ సూచనలు చేశారు. కేసీఆర్ చేపట్టిన 11 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు డిసెంబర్ 9 అని కేటీఆర్ గుర్తుచేశారు. నవంబర్ 29న నిర్వహించిన 'దీక్షా దివస్'ను ఎంత విజయవంతంగా జరిపారో, అదే ఉత్సాహంతో డిసెంబర్ 9న 'విజయ్ దివస్'ను పండుగలా నిర్వహించాలని సూచించారు. 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షకు కేసీఆర్ దీక్ష రూపు ఇచ్చిందని, ఆ ఘట్టాన్ని తరం తరాలకు గుర్తుండేలా చేసుకోవాల్సిన అవసరం ఉందని


(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు
# సర్వం సిద్ధం

- ప్రపంచ దృష్టి హైదరాబాద్‌పై.. నేడు ప్రారంభం గ్లోబల్ సమ్మిట్
- 3 ట్రిలియన్ లక్ష్యానికి తొలి అడుగు ఈ గ్లోబల్ గ్యాదరింగ్
- అంతర్జాతీయవేదికకు సర్వం సిద్ధం - ఇవాళ నుంచే ప్రపంచ సంబురం

హైదరాబాద్: దేశ స్వాతంత్ర్యానికి వందేళ్ల మైలురాయి అయిన 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సు కోసం రూపొందించిన ప్రత్యేక ప్రాంగణం సృజనాత్మకత, ఆధునిక డిజిటల్ సాంకేతికత మేళవింపుతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడింది. దేశ–విదేశాల నుంచి దాదాపు 2 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. సదస్సును సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభించనున్నారు. ఈసారి సదస్సుకు

(మిగతా 2వ పేజీలో)






## రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని సంబరాలు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- బీఆర్ఎస్ 10ఏళ్లలో ఏం చేసిందో కాంగ్రెస్ రెండేళ్లలో అదే చేసింది
- అవినీతి, ఎమ్మెల్యేల ఫిరాయింపుల్లో కాంగ్రెస్ ముందుందని ఆరోపణ
- 6 గ్యారంటీలు, 420 సబ్‌గ్యారంటీల అమలు ఎక్కడని ప్రశ్న
- కాంగ్రెస్ పాలన కూడా బీఆర్ఎస్ పాలన తరహాలోనే ఉందని వ్యాఖ్య

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో ఏం సాధించిందో స్పష్టంగా చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన, "ప్రజా పాలన విజయోత్సవాలు ఎందుకు?

(మిగతా 2వ పేజీలో)




## రెండో విడతలలో 415 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవం

- ఏకగ్రీవంగా ఎన్నికైన 8,304 మంది వార్డు సభ్యులు
- అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 44 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం
- రెండు విడతల్లో కలిపి మొత్తం 810 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

హైదరాబాద్: తెలంగాణలో కొనసాగుతున్న పంచాయతీ ఎన్నికల రెండో విడతలో ఏకగ్రీవాలు భారీగా నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 415 మంది సర్పంచ్ అభ్యర్థులు,

(మిగతా 2వ పేజీలో)

## దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రద్దు కలకలం

- ఒకే రోజులో 650 ఇండిగో విమానాల రద్దు
- విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికుల ఇబ్బందులు
- పరిస్థితిని నియంత్రించేందుకు సంక్షోభ కమిటీ ఏర్పాటు
- పదో తేదీ నాటికి అన్ని సర్వీసులు పునరుద్ధరణ హామీ
- కేంద్ర గుత్తాధిపత్య విధానాలే సంక్షోభానికి కారణం: కాంగ్రెస్
- పరిస్థితిని రాజకీయం చేయొద్దు: కేంద్రమంత్రి రామ్మోహన్




న్యూఢిల్లీ: దేశంలో విమానయాన రంగం భారీ సంక్షోభంలో ఉంది. ఇండిగో సంస్థ వరుసగా విమానాలను రద్దు చేయడంతో విమానాశ్రయాల్లో వేలా ది మంది ప్రయాణికులు పడిగాపులు పడే పరిస్థితి నెలకొంది. ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 650 సర్వీసులు రద్దయ్యాయి. శంషాబాద్ నుంచి 115, బెంగళూరు నుంచి 150, ఢిల్లీ నుంచి 108 సర్వీసులు నిలిచిపోయాయి. పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తున్నామని, బుధవారం నాటికి దాదాపు అన్ని సర్వీసులను పునరుద్ధరిస్తామని ఇండిగో స్పష్టం చేసింది. "138 ప్రాంతాల్లో 135 ప్రాంతాలకు సర్వీసులు తిరిగి ప్రారంభించాం. ప్రయాణికుల ఇబ్బందులు తగ్గించేలా ముందస్తు సమాచారాన్ని అందిస్తున్నాం" అని సంస్థ ప్రకటించింది. సంక్షోభంపై కేంద్రం కూడా కదిలింది. డీజీసీఏ ఇండిగో సీఈవో

(మిగతా 2వ పేజీలో)




## కిషన్‌రెడ్డికి తెలంగాణపై మాట్లాడే హక్కే లేదు: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

- కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చేసిన సేవలు 'శూన్యం' అని ఆరోపణ
- తెలంగాణ అభివృద్ధిపై వ్యాఖ్యానించే నైతిక హక్కు ఆయనకు లేదని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నమ్మకాన్ని అందించిందని వ్యాఖ్య
- బీజేపీ మహాధర్నా కుట్రపూరిత చర్య అని ఆరోపణ
- గ్లోబల్ సమ్మిట్‌ను ప్రభుత్వం గర్వంగా నిర్వహించనున్నట్లు స్పష్టం

# గోవా నైట్‌క్లబ్‌లో భయానక అగ్నిప్రమాదం




## 25 మంది దుర్మరణం

నలుగురు పర్యాటకులు, 14 మంది క్లబ్ సిబ్బంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉందని వెల్లడించారు. అగ్నిప్రమాదానికి ప్రధాన కారణం క్లబ్‌లో పేలుడు సంభవించడమేనని సీఎం ప్రమోద్ సావంత్ తెలిపారు. బాణసంచా వెలిగించటంతో స్పార్క్స్ పైకప్పు పదార్థాలకు అంటుకుని మంటలు వ్యాపించినట్లు ప్రారంభ దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. భద్రతా నిబంధనలను పూర్తిగా అతిక్రమించి క్లబ్‌ను నిర్వహించారని పోలీసులు స్పష్టం చేశారు. క్లబ్ భవనం నిర్మాణపరంగా ప్రమాదకరమని గ్రామపంచాయతీ ఇప్పటికే నోటీసులు ఇచ్చినా నిర్వాహకులు పట్టించుకోలేదని సమాచారం. మంటలు వ్యాపించగానే చాలా మంది బయటకు పరుగులు పెట్టే ప్రయత్నం చేశారు. అయితే, బయటకు వెళ్లే దారులు బాగా ఇరుకుగా ఉండటంతో కొందరు బేస్‌మెంట్‌లోని వంటగదిలోకి వెళ్లి చిక్కుకుపోయారు. అక్కడే ఊపిరాడక మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై క్లబ్ యజమానులు, మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్లబ్‌కు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలపై గ్రామ సర్పంచ్‌ను అరెస్టు చేశారు. అదేవిధంగా ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. మృతుల కుటుంబాలకు గోవా ప్రభుత్వం రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అగ్నిమాపక వాహనాలు ప్రమాద స్థలానికి చేరుకున్నప్పటికీ దారి చాలా ఇరుకుగా ఉండటంతో 400 మీటర్ల దూరంలోనే ఆగాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. క్లబ్ మొత్తమే మంటల్లో దగ్ధమైంది.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

44 దేశాల నుంచి 154 మంది విదేశీ ప్రతినిధులు వస్తున్నారు. అమెరికా నుంచి మాత్రమే 46 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనడం విశేషం. ఫార్చ్యూన్%-%500 కంపెనీల ప్రతినిధులు, కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాల్లోని పలువురు మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా హాజరవుతారని సమాచారం. రెండు రోజుల్లో మొత్తం 27 కీలక అంశాలపై చర్చాగోష్టులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. రెండో రోజు 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047'ను అధికారికంగా ఆవిష్కరిస్తారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, పెట్టుబడుల అవకాశాలు, భవిష్యత్తు ఫ్యూచర్ సిటీ అభివృద్ధి దిశలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరిస్తారు. భారత్ ఫ్యూచర్ సిటీలో 80 ఎకరాల విస్తీర్ణాన్ని 8 జోన్లు, 33 క్లస్టర్లుగా విభజించి సదస్సు ప్రాంగణాన్ని రూపొందించారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెండు ప్రధాన సమావేశ మందిరాలు, ఆరు ప్రత్యేక హాల్స్‌ను సిద్ధం చేశారు. ప్రధాన సభలో 2,500 మంది, సెషన్ హాల్స్‌లో 200 మంది పాల్గొనే అవకాశం ఉంది. ఏర్పాటు పనులను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రత్యక్షంగా పరిశీలించి సూచనలు చేశారు. ఎర్పాట్లన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకునేందుకు నిర్వహించిన 'డ్రై రన్' విజయవంతంగా పూర్తయింది. విద్యుత్, నీరు, ఇంటర్నెట్, కమ్యూనికేషన్, 3%ణ-ాజణ% ప్రొజెక్షన్, లైటింగ్, సౌండ్ వంటి అన్ని సదుపాయాలను విభాగాలు పరీక్షించాయి. మూడు హెలీప్యాడ్లు, రాకపోకల దారులు, సైన్ బోర్డులను సక్రమంగా ఏర్పాటు చేశారు. సదస్సు భద్రతను అత్యంత కట్టుదిట్టంగా చేపట్టారు. మొత్తం ప్రాంగణమంతా 1,000 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ జరుగుతుంది. ప్రధాన వేదిక చుట్టూ వెయ్యి మంది పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. షంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ట్రాఫిక్ నియంత్రణ కోసం 1,500 మంది పోలీసులు మోహరించారు. ప్రతినిధులకు అందించబోయే 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముద్రించారు. 50 మీటర్ల స్వాగత ద్వారం, 3%ణ% టన్నెల్, 85 మీటర్ల ఎల్‌ఈడీ తెర అతిథులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా లోపం లేకుండా బహుళ కెవీఏ పవర్ బ్యాకప్‌లు సిద్ధంగా ఉంచారు. సదస్సు ప్రాంగణంలో తెలంగాణ ఆర్థిక ప్రగతి, సంస్కృతి, సంప్రదాయాలను ఎల్‌ఈడీ తెరలపై ప్రదర్శిస్తున్నారు. ప్రతినిధుల కోసం ప్రత్యేక ఫోటో సెషన్ జోన్‌ను ఏర్పాటు చేశారు. అతిథులకు 10 %+ఎజూం% వేగంతో ఉచిత వైఫై సదుపాయం అందుబాటులో ఉంటుంది. అత్యవసర వైద్య సేవలకు 10 పడకల ఆసుపత్రి, 108 అంబులెన్సులు సిద్ధంగా ఉన్నాయి. అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని వైపులా ఫైర్




ఇంజిన్లను మోహరించారు. ఫ్యూచర్ సిటీ, శంషాబాద్%-%ఔటర్ రింగ్ ప్రాంతాల్లో రానున్న సంవత్సరాల్లో అభివృద్ధి చెందబోయే ప్రాజెక్టులు, భవిష్యత్ జీవన ప్రమాణాల గురించి వివరిస్తూ ప్రాంగణాన్ని డిజిటల్ స్క్రీన్లతో నింపారు. అతిథులు తెలంగాణ సందర్శనను చిరస్మరణీయంగా గుర్తుంచుకునేలా ప్రత్యేక సావనీర్లను సిద్ధం చేశారు. వీటిలో పోచంపల్లి ఇక్కత్ శాలువాలు, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తరు, ముత్యాల నగలు ఉన్నాయి. అలాగే తెలంగాణ సంప్రదాయ వంటకాలు ు ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, నువ్వులుండలు వంటి ప్రత్యేక స్వీట్ల బహుమతి బాక్స్‌ను ఇస్తున్నారు. సమ్మిట్‌లో సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి సంగీత కచేరి, కొమ్ము కోయ, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల వంటి తెలంగాణ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. దౌత్య బృందాల కోసం బుద్ధవనం పర్యటనను పర్యాటక శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. రెండు రోజుల పాటు హైదరాబాదీ బిర్యానీతో పాటు తెలంగాణ వంటకాల విందు కూడా ప్రతినిధులకు ఏర్పాటు చేశారు.

# చీఫ్ జస్టిస్ కొడుక్కి.. కూలీ కొడుక్కి ఒకే న్యాయమా?: మాజీ సీజేఐ గవాయ్

**ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ వర్తింపజేయాలన్న మాజీ సీజేఐ గవాయ్**

**తన తీర్పుపై సొంత వర్గం నుంచే విమర్శలు ఎదుర్కొన్నానని వెల్లడి**

**సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జి పదవులకు రిజర్వేషన్లు ఉండవని స్పష్టీకరణ**

**రిజర్వేషన్ ఫలాలు నిజమైన అర్హులకే చేరాలన్నదే తన ఉద్దేశమని వ్యాఖ్య**

**అదే అంబేడ్కర్ అసలైన ఆశయమని అభిప్రాయం**



షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) కూడా క్రీమీలేయర్ విధానాన్ని వర్తింపజేయాలని తాను ఇచ్చిన తీర్పుపై సొంత వర్గం నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడించారు. రిజర్వేషన్ల ఫలాలు నిజంగా వెనుకబడిన వర్గాలకే చేరాలన్నదే తన ఉద్దేశమని, ఈ విషయంలో తన వైఖరిని ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. "భారత ప్రధాన న్యాయమూర్తి కుమారుడికి, గ్రామ పంచాయతీ పాఠశాలలో చదివిన ఒక కూలీ కుమారుడికి ఒకే రకమైన కొలమానం వర్తింపజేయడం రాజ్యాంగం చెప్పిన సమానత్వం ఎలా అవుతుంది?" అని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్ ప్రయోజనాలు పొంది సుప్రీంకోర్టు జడ్జి అయ్యాక, ఇప్పుడు ఇతరులకు ఆ ఫలాలు అందకుండా చేస్తున్నానని తనపై ఆరోపణలు చేశారని గవాయ్ గుర్తు చేసుకున్నారు. అయితే, ఈ విమర్శలు రాజ్యాంగ నిబంధనలపై అవగాహన లేమితో చేస్తున్నారని ఆయన అన్నారు. "సుప్రీంకోర్టు, హైకోర్టు వంటి రాజ్యాంగ పదవులకు రిజర్వేషన్లు ఉండవన్న ప్రాథమిక విషయం కూడా విమర్శించే వారికి తెలియదు. ఈ పదవులకు ఇతరులతో పోటీపడి మాత్రమే ఎంపిక కావాలి" అని ఆయన స్పష్టం చేశారు. 2024 ఆగస్టులో జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఎస్సీ, ఎస్టీలలో క్రీమీలేయర్‌ను గుర్తించి వారిని రిజర్వేషన్ల పరిధి నుంచి మినహాయించాలని చారిత్రక తీర్పు ఇచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగానే ఈ తీర్పు ఉందని, వెనుకబడిన వారికి చేయూతనిచ్చి ముందుకు నడిపించాలన్నదే ఆయన ఉద్దేశం కానీ, ఆ చేయూతను ఎప్పటికీ వదలకూడదని కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో, మధ్యవర్తిత్వం కేవలం ఉన్నత వర్గాలకే పరిమితం కాకుండా, సామాన్యులకు స్థానిక భాషల్లో అందుబాటులోకి రావాలని పిలుపునిచ్చారు.


# 800 అడుగుల లోయలో పడిన కారు.. ఆరుగురి దుర్మరణం

**మహారాష్ట్రలోని నాసిక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం**

**ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి**

**దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి**

మహారాష్ట్రలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. నాసిక్ జిల్లాలోని ప్రసిద్ధ సప్తశృంగి మాత ఆలయానికి వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి 800 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ఈ విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పటేల్ కుటుంబ సభ్యులు ఆలయ దర్శనానికి కారులో బయల్దేరారు. భవారీ జలపాతం సమీపంలోని ఘాట్ రోడ్డులో ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మార్గంలో రహదారి చాలా ఇరుకుగా, ప్రమాదకరమైన మలుపులతో ఉంటుంది. అదుపుతప్పిన కారు రోడ్డు అంచు నుంచి లోయలోకి దూసుకెళ్లడంతో అందులో ఉన్నవారంతా అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను కీర్తి పటేల్ (50), రసిలా పటేల్ (50), విఠల్ పటేల్ (65), లతా పటేల్ (60), పచన్ పటేల్ (60), మణిబెన్ పటేల్ (60)గా పోలీసులు గుర్తించారు. వీరంతా దగ్గరి బంధువులు. ఈ దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే, లోయ చాలా లోతుగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. మరోవైపు, రహదారి నిర్వహణ లోపం, భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం



జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డిసెంబర్ 9ను 'విజయ్ దివస్' ఘనంగా జరపాలి: కేటీఆర్

వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల బిజీ నేపథ్యంలో గ్రామాల వరకూ కాకుండా, కేవలం నియోజకవర్గ కేంద్రాల్లోనే కార్యక్రమాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేసి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని, పార్టీ కార్యాలయాలు లేదా ప్రధాన కూడళ్లలో పింక్ బెలూన్లను ఎగరేసి విజయోత్సవ వాతావరణం సృష్టించాలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విజయవంతమైన నిమ్స్ ఆసుపత్రిలో, అలాగే గాంధీ ఆసుపత్రిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని కేటీఆర్ చెప్పారు. నగర పార్టీ నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

## రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని సంబరాలు

ఏ విజయాలు?" అంటూ ఆక్షేపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన వాటినే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పునరావృతం చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులు, అవినీతి వ్యవహారాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కంటే ముందంజలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలలో ఏమి అమలయ్యాయో ప్రజలకు నివేదిక ఇవ్వాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి నుంచి హైటెక్ సిటీ వరకు భూముల అమ్మకాల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను మించి పోయిందని పేర్కొన్నారు. భూముల ఆక్రమణల్లో మంత్రుల నుంచి కింది స్థాయి కాంగ్రెస్ నాయకుల వరకు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనకు కాంగ్రెస్ పాలనకు మధ్య పెద్దగా తేడా ఏమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై త్వరలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రద్దు కలకలం

పీటర్ ఎల్బర్స్‌కి, సీవోవో ఇసిడ్రో పోర్కెర్‌సలకు షోకాజ్ నోటీసులు పంపింది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇదే సమయంలో పార్లమెంటరీ స్థాయి సంఘం కూడా ఈ అంశంపై సమగ్ర వివరణ కోరనుంది. ఇండిగో రద్దులతో ప్రయాణికులకు భారీ ఇబ్బందులు కలగడంతో ఆదివారానికల్లా రూ.610 కోట్ల రీఫండ్లు చెల్లించినట్టు సంస్థ వెల్లడించింది. మూడు వేల బ్యాగులను ప్రయాణికులకు అందజేసినట్టు కూడా తెలిపింది. మరోవైపు ఎయిరిండియా తమ ప్రయాణికులకు టికెట్ రద్దు, తేదీ మార్పుపై చార్జీల మినహాయింపు ప్రకటించింది. బాలీవుడ్ నటుడు సోనుసూద్ కూడా ఈ సమస్యపై స్పందించారు. "సిబ్బంది కూడా నిస్సహాయులే వారికి మర్యాద చూపాలి" అంటూ ప్రయాణికులను విజ్ఞప్తి చేశారు. ఇక ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల్లో మొత్తం 5 వేలకుపైగా విమానాలు రద్దయ్యాయని పైలట్ల సంఘాలు తెలిపారు. కొత్తగా అమల్లోకి వచ్చిన ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను సరిగా అంచనా వేయకపోవడం ఇండిగో పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. 300 మంది పైలట్లు, సంబంధిత సిబ్బంది ఒకేసారి అందుబాటులో లేక భారీ సంక్షోభం ఏర్పడిందని వెల్లడించారు. ఈ పరిస్థితిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. "కేంద్ర గుత్తాధిపత్య విధానాల ఫలితమే ఈ సంక్షోభం" అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని విమర్శించారు. అయితే ఈ వ్యాఖ్యలను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ ఖండించారు. "ఇది ప్రజల సమస్య%ౌ% రాజకీయ విషయం కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

## కిషన్‌రెడ్డికి తెలంగాణపై మాట్లాడే హక్కే లేదు: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

కేంద్ర మంత్రిగా ఉన్న జి. కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చేసిన సేవలు పూర్తిగా 'శూన్యం' అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మన్నన పొందుతున్నాయని, దీనిని భరించలేక బీజేపీ నేతలు మహాధర్నా పేరుతో అపప్రథలు సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పు బీజేపీపై ఎలా ఉందో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో డిపాజిట్ కూడా దక్కలేదన్న అంశమే స్పష్టంగా చెప్పేస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రజలు గర్వంగా చూసేలా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ కార్యక్రమానికి కూడా అడ్డంకులు సృష్టించేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు బీజేపీ నాయకులు మానుకోవాలని, ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయొద్దని మహేశ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు.

## రెండో విడతలలో 415 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవం

8,304 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అధికారికంగా ప్రకటించింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే, కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 44 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో చెరో 38 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో భాగంగా 4,332 గ్రామ పంచాయతీలకు, 38,322 వార్డులకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, ఐదు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి, 107 వార్డుల్లో సభ్యుల పదవులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి సర్పంచ్ బరి నుంచి 7,584 మంది, వార్డు సభ్యుల బరి నుంచి 10,427 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన రెండు విడతలను కలిపి చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 810 మంది సర్పంచ్‌లు, 17,635 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటనలో స్పష్టం చేసింది. మిగిలిన స్థానాలకు త్వరలోనే పోలింగ్ జరగనుంది.

## హైదరాబాదులో అమెరికా కాన్సులేట్ రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ పేరు

తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు చేసింది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ఆదివారం నిర్ణయించింది. ఈ రహదారిని ఇకపై 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పిలవనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదన గురించి కేంద్ర విదేశాంగ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి త్వరలోనే లేఖ రాయనున్నట్లు ముఖ్య మంత్రి కార్యాలయం (సీఎంవో) ఒక ప్రకటనలో పేర్కొంది. రావిర్యాల వద్ద నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డును, ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డును కలిపే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టనున్నారు. ఇప్పటికే రవిర్యాల వద్ద ఉన్న ఇంటర్‌ఛేంజ్‌కు 'టాటా ఇంటర్‌ఛేంజ్' అని పేరు ఉన్న విషయం తెలిసిందే. అదేవిధంగా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో గూగుల్ నిర్మిస్తున్న భారీ క్యాంపస్ సమీపంలోని రహదారికి 'గూగుల్ స్ట్రీట్' అని నామకరణం చేయనున్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ముఖ్యమైన రోడ్లకు ప్రపంచస్థాయి కార్పొరేషన్ల పేర్లు పెడతామని ప్రకటించారు. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తులో 'మైక్రోసాఫ్ట్ రోడ్', 'విప్రో జంక్షన్' వంటి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# బలిదానాలు చేయొద్దు బరిగిసి యుద్ధం చేద్దాం: వేదాంత్ మౌర్య

**బీసీ లకు 42% రిజర్వేషన్ల సాధనకై సాయి ఈశ్వర చారి ఆత్మహుతి విషాదకరం**

**బలిదానాల చేయొద్దు బరిగిసి యుద్ధం చేద్దాం**

**మేమెంతో నాకంత అనే నినాదాన్ని మరవొద్దు**

**శాంతి యుత పోరాటంతో విజయాన్ని సాధిద్దాం**

**- సాయి ఈశ్వర చారి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.**

**చారి కుటుంబానికి ఒక కోటి పరిహారం ఇవ్వాలి, భార్యకి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి**

**చారి కుటుంబానికి SSF రాష్ట్ర కమిటీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుంది**

**42% బీసీ రిజర్వేషన్లపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలి డిమాండ్ చేస్తున్నాం**

**సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాన్సువాడ వేదాంత్ మౌర్య**



హైద్రాబాద్ (వాయిస్ టుడే): మేమెంతో మాకంత అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్లపై పోరాటం కొనసాగిస్తున్న నేపథ్యంలో ఒక బీసీ యువకుడు ఆర్థికంగా, రాజకీయ,ఉద్యోగ రంగంలో బీసీలకు రావాల్సిన వాటా కోసం నేడు సాయి ఈశ్వర చారి ఆత్మహుతి చేసుకోవడం చాలా విషాదకరం. గ్రేటర్ హైదరాబాద్ లోని జగదిరిగుట్ట ప్రాంతంలో నేడు ఈశ్వర చారి అంతిమయాత్రలో పాల్గొని సంతాపం తెలియజేసిన సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంత్ మౌర్య తదనంతరం తాను మాట్లాడుతూ బలిదానాలు ఆపేద్దాం భరిగీసి కొట్లాడుదాం అంటూ ఈ దేశంలో నూటికి 60 శాతం ఉన్నటువంటి బీసీలు 42 శాతం రిజర్వేషన్లపై పోరాటం చేస్తే దున్నపోతు మీద వర్షం కురిసినట్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయని, బీసీల గొంతుపై కత్తిపెట్టి వారిని బానిసలుగా మార్చుకొని రాజ్యమేలుతున్నారని వారికి రావలసిన వాటని ఇవ్వకుండా ఊపదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ,బీసీ బందులో టిఆర్ఎస్ ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్టు నాటకాలు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం మాత్రమే చేశారని, అంత చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది ఎంపి స్థానాలు 8 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం ఏం చేస్తుందని అలాగే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు బీసీలకు 42% రిజర్వేషన్లపై ఎంతటికైనా పోరాడుతామని దేనికైనా తెగిస్తామని యువత మేలుకొని ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని సామాజిక ఉద్యమాలకు అండగా నిలవాలని తాను పిలుపునిచ్చాడు ఈ కార్యక్రమంలో దళిత బహుజన బీసీ సంఘాల నాయకులు పలుజిల్లాల నుండి భారీ ఎత్తున పాల్గొని సాయి ఈశ్వర చారి అంతిమయాత్రని ముగించారు.




## ఆరోగ్యవంతమైన జీవితానికి ప్రతీ రోజు కోడి గ్రుడ్డు తప్పక తినాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 7(వాయిస్ టుడే): దుండిగల్ మున్సిపాలిటీ పరిధి ఎంఎల్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (నెక్) ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను సిద్ధిపేట శాసనసభ్యులు హరీష్ రావు కలిసి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పౌష్టికాహారం సమృద్ధిగా ఉన్న చౌకైన ఆహారం గుడ్డు అని, ఆరోగ్యవంతమైన జీవితానికి ప్రతీఒక్కరూ రోజు కోడి గ్రుడ్డు తప్పక తినాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జన్నారం బహదూర్ పల్లి ఇందిరమ్మ కాలనీలో బికేఆర్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 7(వాయిస్ టుడే): బీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి ఇందిరామ కాలనీ లో 11వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందంతో కలిసి జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించిన ఆయన, ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మెడికవర్ వైద్య బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ ఆర్ సాధు యాదవ్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పరశురాం గౌడ్ ధర్మారెడ్డి రాంబాబు గౌడ్ గోపాల్ రెడ్డి చారి పలువురు స్థానిక నాయకులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో రోడ్డు మంజూరు



కుత్బుల్లాపూర్ డిసెంబర్ 7(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 డివిజన్ జీడిమెట్ల పరిధిలోని వుడ్స్ ఎంక్లేవ్ కాలనీ లో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి. ఇంచార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్డు మంజూరు చేయించిన నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ సందర్బంగా కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాలనీ పరిధిలోని శివ ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు శివరామకృష్ణ, శ్రీహరి రెడ్డి, బిక్షపతి గౌడ్. అనంత రామ్ రెడ్డి. పాండురంగారావు. రాజేందర్ రెడ్డి, శివ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ప్రజా వంచన దినం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలు

**అమలు చేయని హామీలు, అసంబద్ధ, ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా.**

ఈ కార్యక్రమంలో భాగంగా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టే చార్జ్‌షీట్‌ను రిలీజ్ చేసిన బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ డీకే అరుణ ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య గారు, అంజిరెడ్డి శాసనసభ్యుడు పాయల్ మేడిపట్నం కార్పెంటర్ కర్ణాకర్ తనయుడు పాల్గొన్నారు శంకర్ సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# అమ్మను మించిన దైవం లేదు



హైదరాబాద్ డిసెంబర్ 07: అమ్మను మించిన దైవం లేదని ప్రముఖ న్యాయవాది బర్మ ఇందిర అన్నారు. కాసుల అనసూయ వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 'రోల్ ఆఫ్ మదర్ ఇన్ వన్స్ లైఫ్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెలకట్టలేని ప్రేమకు నిలువెత్తు రూపం అమ్మ అని అన్నారు. భారతీయ సంస్కృతిలో అమ్మకు ఉన్నతమైన స్థానం కల్పించబడిందని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయలంలో తల్లికి అంటూ ప్రత్యేక రోజు లేదని అనునిత్యం మాతృమూర్తి పూజనీయులుగా భావించాలనే సంస్కారం మనదని అన్నారు. అమ్మ లేనిదే సృష్టిలేదని అన్నారు. ఈ సందర్భంగా భవాని, లక్ష్మాంజలి, హేమలత, పద్మప్రియ, విజయభారతి, రమా, ఆకుల రాణి తదితర మాతృమూర్తులను సత్కరించి అభినందించారు. పిల్లలు తల్లుల ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని వివరిస్తూ ప్రసంగించిన తీరు అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ అనన్య, విశాంత్, ద్వితీయ వరుణ్, వర్ణిక, తృతీయ శృతిక, తన్వీలు గెలుపొందారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిల్ కుమార్ జా, అడ్వొకెట్ కొమ్మిరెడ్డి కరమ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్ ట్రస్ట్ చైర్మన్ కాసుల మల్లికార్జున్, సీనియర్ ట్రస్టీ నర్రా దేవేందర్, సీనియర్ అడ్వొకెట్ కాసుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ మోసలా పట్ల జాగ్రత్త వహించండి

**ఆర్థిక మోసాలు జరిగితే 1930కు కాల్ చేయండి**

**మేడిపల్లి సిఐ. ఆర్. గోవింద రెడ్డి**

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, డిసెంబర్ 7 : తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశానుసారం మెడిపల్లి పోలీసులు బోల్లిగుడెం ఏరియా, చెంగిచెర్ల లో సుమారు 300 మంది కాలనీ వాసులతో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు వారాల కార్యక్రమంలో మొదటి వారంలో 'సైబర్ సారధి' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ భద్రత, మరియు మోసాలు జరిగిన వెంటనే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించబడింది. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు జరిగితే వెంటనే 1930 కు కాల్ చేయడం అత్యంత అవసరం. వెంటనే ఇచ్చే సమాచారం ద్వారా పోలీసులు మరియు బ్యాంకులు మోసపోయిన మొత్తం ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది. అలాగే గోల్డెన్ అవర్ రిపోర్టింగ్ సైబర్ మోసం జరిగిన మొదటి ఒక గంట అత్యంత కీలకం. ఈ సమయంలో రిపోర్ట్ చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పుట్ ఆన్ హెూల్డ్ అవకాశం వెంటనే 1930 లేదా సైబర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే, సంబంధిత ఖాతాపై పుట్ ఆన్ హెూల్డ్ అవకాశం ఉంటుంది, తద్వారా మోసగాళ్లు డబ్బు ఉపసంహరణ చేయకుండా తక్షణమే అడ్డుకుంటారు.

రోజు వచ్చే కాల్స్ సంఖ్య, ప్రతిరోజూ యూపీఐ, సోషల్ మీడియా, ఉద్యోగాలు, పెట్టుబడులు, ఓటీపీ, కస్టమర్ కేర్ మోసాలు వంటి అనేక ఫిర్యాదులు పెద్ద ఎత్తున 1930 హెల్ప్‌లైన్‌కు వస్తున్నాయి. రోజువారీ నష్టాలు ప్రజలు ప్రతిరోజూ కోట్ల రూపాయల మేరకు సైబర్ మోసాలకు గురవుతున్నారని, అవగాహనతో తక్షణ ఫిర్యాదు చేస్తే ఈ నష్టాలను తగ్గించవచ్చని వివరించారు. AI చాట్‌బాట్ ద్వారా వేగవంతమైన రిపోర్టింగ్ సైబర్ సారధి"లో భాగంగా, త్వరితగతిన మార్గదర్శకత్వం అందించడానికి, ఫిర్యాదులను వాయిదా లేకుండా నమోదు చేయడానికి, గోల్డెన్ అవర్ రిపోర్టింగ్ పెంచడానికి తెలంగాణ పోలీసులు AI ఆధారిత సైబర్ సహాయక చాట్‌బాట్ ను ప్రవేశపెట్టారు. ఇది రిపోర్టింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించగలదని వివరించారు. మెడిపల్లి పోలీసులు ఆధ్వర్యంలో బోల్లిగుడెం ఏరియా కాలనీ వాసులకు ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదమైన సైబర్ కార్యకలాపాలను వెంటనే రిపోర్ట్ చేయాలని, మరియు తమ కుటుంబ సభ్యులకు స్నేహితులకు కూడా ఇదే అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సైలు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## శ్రీనిధి కాలేజ్ విద్యార్థిని దుర్మరణం



మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్,డిసెంబర్ 07 : బైక్ పై వెళుతూ నియంత్రణ కోల్పోయి విద్యార్థిని మృతి చెందిన సంఘటన నారపల్లిలో జరిగింది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భాస్కర్ కుమార్తె దాసరి హసిని, వయస్సు,18 సంవత్సరాలు, శ్రినిధి కాలేజ్, ఘట్‌కేసర్‌లో ఇంజనీరింగ్ 1వ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో నివసిస్తుంది. ఆదివారం ఉదయం సుమారు 02:00 గంటల సమయంలో, హసిని తన స్నేహితుడు యెల్లగండుల అక్షయ్ వయస్సు 18 సంవత్సరాలు తో కలిసి, అక్షయ్ నడిపిస్తున్న బుల్లెట్ బైక్ నంబర్, TG30B%1972)పై ఉప్పల్ నుండి ఘట్‌కేసర్ వైపు ప్రయాణిస్తుండగా, నారపల్లి జైన్ అపార్ట్‌మెంట్ సమీపానికి చేరుకున్నప్పుడు బైక్‌పై నియంత్రణ కోల్పోయి జారి పడింది. ఈ ప్రమాదంలో పిలియన్ రైడర్ హసిని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే ఘటన స్థలంలోనే మరణించింది. రైడర్ అక్షయ్ శరీరంపై గాయాలు కావడంతో సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హసిని తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడమైనదని,సీఐ ఆర్. గోవిందా రెడ్డి తెలిపారు.



## శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి వారి 18 పడుల మహాపడి పూజ మహెూత్సవం

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 7 ( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 132 జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్ర చౌరస్తా తినర్ సినిపోలీస్ మాల్ వద్ద తత్వ మసి సేవ సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 18 పడుల మహా పడిపూజా మహెూత్సవ కార్యక్రమం లో పాల్గొని స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.



## 18వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహెూత్సవం

**పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 7(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 డివిజన్ జీడిమెట్ల పరధిలోని తత్త్వమసి సవా సమితి వారు నిర్వహించిన 18వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ :సంతోషాలతో ఎల్లపుడు ఉండాలని అయ్యప్ప స్వామిని కోరిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని స్రావం కుమార్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, సీనియర్ నాయకులు క్రిష్ణ రెడ్డి, శ్రీనివాస్, బి బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్ , మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్ , శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## స్ట్రీట్ కాజ్ VJIT నుండి మరొక సేవా కార్యక్రమం

### సరూర్నగర్ మండల్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్‌లో ఆదరణ అనాథాశ్రమానికి బెడ్‌షీట్లు దానం

స్ట్రీట్ కాజ్ VJIT ఆధ్వర్యంలో సరోర్నగర్‌లోని ఆదరణ అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించబడింది. అనాథ పిల్లల మౌలిక అవసరాలను తీర్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఆశ్రమానికి అవసరమైన బెడ్‌షీట్లు టీమ్ అందించింది. పిల్లలతో సమయం %-% వారి అవసరాలపై దృష్టి ఈ కార్యక్రమంలో స్ట్రీట్ కాజ్ VJIT సభ్యులు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లలతో మాట్లాడి, వారి అవసరాలను అర్థం చేసుకుని, సాధ్యమైనంత సహాయం అందించారు. పిల్లలతో గడిపిన సమయం ఎంతో భావోద్వేగంగా, సంతోషంగా సాగింది. సమాజ సేవలో ముందుండే ప్రతిజ్ఞ సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తూ భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలన్న సంకల్పాన్ని స్ట్రీట్ కాజ్ VJIT టీమ్ వ్యక్తం చేసింది.




## ప్రతి భారతీయుడు అంబేద్కర్‌ని స్మరించాలి

**బోడుప్పల్లో 355వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల.**

**రిజర్వేషన్లు అనుభవిస్తున్న వారు అంబేద్కర్ విస్మరించడం బాధాకరం.**

**బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ - బొబ్బల లక్ష్మారెడ్డి.**

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, డిసెంబర్ 07 :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 355వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొబ్బల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక కులానికి ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని యావత్ భారతీయులందరికీ ఆరాధ్యుడు డాక్టర్ అంబేద్కర్, ఆయన పుణ్యఫలితమే నేడు భారతీయులు అనుభవిస్తున్న స్వేచ్ఛ, సమానత్వాలు, ఆయన కల్పించిన రిజర్వేషన్ల పుణ్యమే నేడు అనేక పదవులు ఉద్యోగాలు అనుభవిస్తున్న వారు అంబేద్కర్ విస్మరించడం బాధాకరం, ఇలాంటి సందర్భంలో నత్తి మైసయ్య 355 వారాలుగా ప్రతి ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి ఆయన సేవలను స్మరించడం అభినందనీయం ఆదర్శవంతం అని లక్ష్మారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో దూది పాల్ మహేందర్ రెడ్డి, వరుణ్ రెడ్డి, ఎక్కిరాల లక్ష్మీ నరసయ్య, గరుగుల యాకయ్య, సగ్గు నరసింహ తదితరులు పాల్గొన్నారు.




## జీవనశైలి మార్పుతోనే మధుమేహ సమస్య

### వాకథాన్ ప్రారంభోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాయదుర్గం: జీవనశైలిలో మార్పులు, జన్యుకారణాల వల్ల మధుమేహ సమస్య పెరుగుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. భారతీయ సంప్రదాయ వంటల వినియోగం, వ్యాయామం, యోగా ద్వారా మధుమేహం బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ద ఫుట్ డాక్టర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రాయదుర్గం టీహబ్ వద్ద ఆదివారం మధుమేహ బాధితుల పాదాల సంరక్షణపై అవగాహనకు వాకథాన్ నిర్వహించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. "నాకు 76 ఏళ్లు. మొదటి నుంచి ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉన్నా. యువత ఎలక్ట్రానిక్ పరికరాలకు బానిసగా మారుతూ, శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారు. తల్లిదండ్రులే చిన్నపిల్లల చేతుల్లో చరవాణులు పెడుతున్నారు. ఈ ధోరణి నుంచి బయటపడాలి. నిత్యం వ్యాయామం, యోగా అలవాటుగా మార్చుకోవాలి" అని సూచించారు. కిమ్స్ ఆసుపత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ప్రసంగిస్తూ.. మధుమేహుల్లో 15-20 శాతం మందికి కాళ్లపై పుండ్లు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. మధుమేహ బాధితుల్లో నరాలు పాడవడం వల్ల స్పర్శ సరిగా ఉండదన్నారు. సినీనటుడు సుశాంత్, ద ఫుట్ డాక్టర్ ఆసుపత్రి డైరెక్టర్ నరేంద్రనాథ్ మేడా మాట్లాడారు.

# అంతర్గత శక్తిని విలువైనదిగా భావించి ఆలోచనలను క్రమంగా సంరక్షించుకోండి

### ఉత్తమ నిర్ణయాలు తీసుకొని మీ విధిని మీరే రూపొందించుకోండి..

### దీదీ కృష్ణకుమారి ప్రేరణాత్మక ప్రసంగం



హైదరాబాద్, డిసెంబర్ 7: మీ విధిని మీరే రూపొందించుకోడానికి సరైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రపంచ మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు సాధు వాస్వానీ మిషన్ గ్లోబల్ అధిపతి దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. దీదీ కృష్ణకుమారి హైదరాబాద్‌ను సందర్శించిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సాధు వాస్వానీ మిషన్, హైదరాబాద్‌లోని సాధు వాస్వానీ ఇంటర్నేషన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో 'మీ విధిని రూపొందించండి – మీ మార్గాన్ని ఎవరు రూపొందిస్తారు? మీరు చేస్తారు' ("డిజైన్ యువర్ డెస్టిని హు షేప్స్ యువర్ పాథ్") అనే అంశంపై దీదీ కృష్ణకుమారి ప్రసంగించారు.

ఆద్యంతం ఆలోచనలకు దారితీసే విధంగా ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. మన గమ్యం ముందే రాయబడింది కాదు.. మనమే ప్రతి రోజూ తీసుకునే నిర్ణయాలతో దాన్ని నిర్మించుకుంటాం అని దీదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతి చిన్న నిర్ణయం కూడా మన భవిష్యత్తు తీరు నిర్ణయిస్తుందని దీదీ కృష్ణకుమారి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఒక 'లైక్' రాకపోయినందుకు కలిగే బాధ నుంచి, ఒక కార్యక్రమానికి హాజరు కావాలా వద్దా అన్న నిర్ణయం వరకు జీవితం ఎప్పటికప్పుడు మన చేతుల్లోకి ఎన్నో ఎంపికలను అప్పగిస్తూనే ఉంటుందన్నారు. మన పరిస్థితులు మనల్ని నడపవు మనమే స్టీరింగ్ పట్టుకుంటే జీవితాన్ని నడిపించగలుగుతాం అని దీదీ గుర్తుచేశారు. ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దీదీ కృష్ణకుమారి రెండు అలవాట్లను సూచించారు. మొదటిది..మన ఆలోచనలను క్రమంగా సంరక్షించుకోవడం. నేటి జీవన శైలిలో ఇతరులతో పోల్చుకోవడం, మన వద్ద లేనిదాన్ని కావాలనుకోవడం సహజమైపోయిందన్నారు. అయితే మనపై వచ్చే ఆరోపణలపై దృష్టి పెట్టకుండా, మనకు ఉన్న సన్నిహితుల ఆశీర్వాదాలపై కృతజ్ఞత వ్యక్తం చేసే భావనను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఆలోచన భవిష్యత్తుకు విత్తనమవుతుందని అన్నారు. మనమే జోక్యం చేసుకునే క్షణం నుంచే గమ్యం మారుతుంది అని దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు.

రెండో అలవాటు..సమయాన్ని, అంతర్గత శక్తిని విలువైనదిగా భావించడం. ప్రతి రోజు మన జీవితం ఒక చిన్న నౌక లాంటిది. దానిలో ఏది పడితే అది పోస్తే అది మునిగిపోతుంది అని ఉదాహరణతో వివరించారు. వేలాదిమంది హాజరైన ఈ కార్యక్రమం అత్యంత ఆసక్తికరంగా, ఇంటరాక్టివ్‌గా సాగింది. పాల్గొన్న వారు పెద్ద ఎత్తున స్పందిస్తూ దీదీ కృష్ణకుమారి సందేశాన్ని అభినందించారు. ఎంతో ప్రేరణాత్మకంగా, ఆలోచనలకు నాంది పలికిన సాయంత్రం కోసం వారు కృతజ్ఞతలు తెలిపారు.సాధు వాస్వానీ మిషన్ ఆధ్యాత్మిక, నైతిక కార్యక్రమాలతో పాటు మానవతా సేవలో విస్తృతంగా పాల్గొంటుందని పేర్కొన్నారు.జీవిత ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకోవడం, అనవసర ఆందోళనలను తగ్గించడం, రోజులో కొద్ది నిమిషాలు అయినా నిశ్శబ్దంగా మనసుతో మనమే మాట్లాడుకోవడం వంటి అలవాట్లు మనలోని అపారశక్తిని వెలికి తీస్తాయని చెప్పారు. విధి ఒక్కసారిగా రూపుదాల్చేది కాదని, క్షణం క్షణంగా, ఆలోచన ఆలోచనగా, నిర్ణయం నిర్ణయంగా తయారవుతుంది అని దీదీ కృష్ణ తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మిర్చందాని, హీరా రూపానీ , హరి సాధ్వని, తరుణ్ దహిర్వేద్వాని తదితరులు పాల్గొన్నారు.




## శక్తివంతమైన వికసిత్ భారత్ 2047ను నిర్మించడం ప్రధాని మోదీ కె సాధ్యం

### పార్లమెంట్ సభ్యులు ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్ 07: ఆర్థిక శ్రేయస్సు, పారిశ్రామిక, సామాజిక పురోగతి, పర్యావరణ స్థిరత్వంతో ప్రభావవంతమైన పాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కె శక్తివంతమైన వికసిత్ భారత్ 2047ను నిర్మించడం సాధ్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఆర్. కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, పి.జి.ఆర్.ఆర్.సి.ఈ.డి ఆడిటోరియంలో విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. హరి చరణ్ అధ్యక్షత వహించగా ఆర్. కృష్ణయ్య తోపాటు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రో. వి. బాలకిష్ట రెడ్డి, కర్ణాటక కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రో. బట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి అమర్ సింగ్ థిలావత్, ప్రముఖ న్యాయవాది కొండా లక్ష్మి కాంత్ రెడ్డి, సామజికవేత్త డా. డి. రాజ్ కుమార్ జాదవ్ తదితరులు వేదికపై ఆసీనులైనారు. ఈ సందర్బంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ పేదరికం నిర్మూలనతోపాటు పౌరులకు మెరుగైన జీవన నాణ్యతను నిర్ధారించడానికి కీలకమైన సామాజిక అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి వికసిత్ భారత్ 2047 తోడ్పడుతుందని, విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ కూడా వికసిత్ భారత్ 2047 సాధించడానికి తమ వంతు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వి. బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగమే మనకు అత్యున్నతం అని, దానికి అనుగుణంగానే పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి, మెరుగైన విద్య, ఆరోగ్య భారతం కోసం విజన్ 2047 ప్రణాళికలు రూపొందించి, కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డా. పుట్ట పాండు రంగయ్య, సమన్వయ కార్యదర్శి జి. విజయ హరి చరణ్, కోశాధికారి రాజేందర్ నల్లారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఎన్.డి.పి పనులు త్వరగా పూర్తి చేయాలి

### తుంగతుర్తి రవి- పిర్జాదిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, డిసెంబర్ 07 : పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఎస్. ఎన్.డి.పి (స్ట్రాటెజిక్ నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాము) పనులను ఈరోజు పీర్జాదిగూడ మున్సిపల్ అధ్యక్షులు తుంగతుర్తి రవి పర్యవేక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న డ్రెయినేజీ, లైనింగ్ మరియు రోడ్ రీస్టోరేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, ఎస్. ఎన్.డి.పి పనులు పూర్తికావడంతో వర్షాకాలంలో ఇబ్బందులు కలిగించే వరద నీరు మరియు మురుగు నీటి సమస్యలు తగ్గిపోతాయని తెలిపారు. ప్రజలకు త్వరగా ఉపయోగపడే విధంగా పీర్జాదిగూడ, కాచివాని సింగారం రోడ్డును పూర్తి చేయాలని సంబంధిత శాఖ, కాంట్రాక్టర్ లను అధికారులను సమన్వయ పరచి వారితో మాట్లాడి పనులను పూర్తి చేయాలని చెప్పారు.

అంతేకాకుండా, పనులను నాణ్యత ప్రమాణాలకు లోబడి, ఎలాంటి లీకేజీలు లేకుండా, భవిష్యత్తులో సమస్యలు రాకుండా అత్యంత జాగ్రత్తగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పీర్జాదిగూడ కాచవని సింగారం రోడ్డును పది రోజుల లోపే ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చంద్రారెడ్డి,వీరాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త వంగూరి పరమేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, పెంటయ్య గౌడ్, వంగూరి ప్రభంజన్ మరియు స్థానిక నాయకులు, పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుడు ఈశ్వరాచారికి ఎంపీ వద్దిరాజు, బీఆర్ఎస్ నాయకుల నివాళులు

హైదరాబాద్, (వాయిస్ టుడే) డిసెంబర్ 7 : బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం త్యాగం చేసిన అమరవీరుడు సాయి ఈశ్వరాచారికి బీఆర్ఎస్ నాయకులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. జగద్గిరిగుట్ట బీరప్ప నగర్‌లో నివసిస్తున్న ఈశ్వరాచారి కుటుంబాన్ని ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సీనియర్ నాయకులు శుభ్రప్రద్ పటేల్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ కలిసి పరామర్శించారు. నాయకులు ఈశ్వరాచారి చిత్రపటానికి పూలు అర్పించి రెండు నిమిషాల మౌన వ్రతంతో నివాళులర్పించారు.



### బీసీలపై కాంగ్రెస్ మోసం-ఈశ్వరాచారి ప్రాణత్యాగం: బీఆర్ఎస్ విమర్శ

నాయకులు మాటాడుతూ.. "ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత కూడా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పి, చివరికి పంచాయతీ ఎన్నికల్లో కేవలం 17% మాత్రమే ఇచ్చి బీసీలను మోసం చేసింది. ఈ ప్రభుత్వ ద్రోహం, అన్యాయం ఈశ్వరాచారి లాంటి యువకుడి ప్రాణం తీసింది" అని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా ఉపాధి రంగాల్లో బీసీలకు హక్కుగా రావాల్సిన వాటాను ప్రభుత్వం చూరగొంటుందనే భావన యువతలో తీవ్ర నిరాశను కలిగించిందని రవిచంద్ర వ్యాఖ్యానించారు.

బీసీల ఉద్యమానికి ఈశ్వరాచారి త్యాగం శాశ్వత ప్రేరణ.. నాయకులు పేర్కొంటూ "ఈశ్వరాచారి త్యాగం వృథా కాదు. తెలంగాణలో 136 బీసీ కులాల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి ఇది శాశ్వత దీప్తి. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం వెనక్కి తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు" అని హెచ్చరించారు.

### కుటుంబ సభ్యులకు ఆశ్వాసం-పార్టీ అండ

ఈ సందర్భంగా ఈశ్వరాచారి తల్లి ప్రమీల, సోదరుడు నందీశ్వర్, భార్య కవిత, కూతుళ్లు కృతిక, సాయి చిట్టి, కుమారుడు సాయిదత్తలను బీఆర్ఎస్ నాయకులు ఓదార్చారు. "మీ కుటుంబం ఒంటరిగా లేదు. పార్టీ మీకు అండగా నిలుస్తుంది. ఈశ్వరాచారి త్యాగాన్ని తెలంగాణ చరిత్ర గుర్తుంచుకోబోతుంది" అని వారికి భరోసానిచ్చారు.

### ప్రభుత్వంపై బీసీ సంఘాల ఆగ్రహం పెరుగుతోంది

ఈశ్వరాచారి మరణం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు ప్రారంభించిన నేపథ్యంలో, ఈ ఘటన బీసీ రిజర్వేషన్లపై రాజకీయ వేడి మరింత పెంచే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీసీలకు న్యాయం చేయకపోతే ప్రభుత్వం ప్రజాస్వామ్యంగా రుణపడి ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# నేత్రపర్వంగా... ఆదిదంపతుల కళ్యాణం

**– భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ జప యజ్ఞం**

**– శివ నామస్మరణతో దత్తగిరి**

**ముగిసిన దత్త జయంతి ఉత్సవాలు**



ఝరాసంగం డిసెంబర్ 7 (వాయిస్ టుడే): జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం శనివారం రాత్రి దత్త జయంతి ముగింపు సందర్భంగా ఆది దంపతులైన శివ పార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పరిసరాలు ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో మారుమోగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆది దంపతుల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా, ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, పార్వతి పరమేశ్వరులకు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు జీలకర్రబెల్లం, కన్యాదానతంతు నిర్వహించారు. వేదపండితులు నిర్ణయించిన సుముహూర్తంలో అమ్మవారి మెడలో పరమేశ్వరుడు మాంగల్యధారణ చేశారు. వైదిక పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. జహీరాబాద్, బీదర్, ఝరాసంగ. రాయికోడ్, మొగుడంపల్లి, నారాయణఖేడ్, భక్తులు కళ్యాణానికి హాజరయ్యారు. శనివారం అర్ధరాత్రి వరకు భజన సంకీర్తనలు కొనసాగాయి. గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న ఉత్సవాలు వైభవంగా భక్తిశ్రద్ధలతో ముగిశాయి.

## శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు వేగవంతం



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 07: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.జరుగుతున్నవిస్తరణ పనులు కారణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, శృంగేరి జగద్గురువు శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతీ మహాస్వామి వారి ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి.ఈ నేపథ్యంలో, శ్రీ స్వామి మరియు అమ్మవారి దర్శనాలు తూర్పు రాజగోపురం ఎదురుగా తాత్కాలికంగా ఏర్పాటు చేయబడ్డాయి.అదేవిధంగా, భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలు, అభిషేకాలు, అన్నపూజలు, కుంకుమార్చనలు, కళ్యాణాలు, కోడెమ్రొక్కు, మ్రొక్కుబడులు తదితర సేవలను తాత్కాలికంగా శ్రీ భీమేశ్వర ఆలయంలో నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.భక్తులు తమ సేవలు, మ్రొక్కుబడులు భీమేశ్వర ఆలయం వద్దే చెల్లించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫు కరాటే పోటీలు

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 07: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం లోని మహా లింగేశ్వర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు కరాటే పోటీలు జరిగాయి. పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ ఆఫ్ సిరిసిల్ల మాస్టర్ వడ్నాల అన్నపూర్ణ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి 14 పథకాలు కైవసం చేసుకోవడం జరిగింది . బ్రౌన్ బెల్ట్ ఫైట్ విభాగంలో గౌతమ్ ఆనంద్ ప్రథమ బహుమతి బంగారు పతకం అలాగే సబ్ జూనియర్ బ్రౌన్ బెల్ట్ విభాగంలో గౌతమ్ గౌరవ్ ప్రథమ బహుమతి బంగారు పతకం కూన సదంజన్,బంగారు పతకాలు సాధించారు. అలాగే కలర్ బెల్ట్స్ కటా విభాగంలో కూన వైష్ణవి,బంగారు పతకం, గుగ్గిళ్ల రుత్విక బంగారు పతకం, మురళీకృష్ణ బంగారు పతకం, రెహాన్ వెండి పతక%శీ%,లింగం రుథ్వీసా వెండి పథకం, శివన్స్ వెండి పథకం,అక్షర వెండి పథకం, అక్షయ వెండి పథకం,అలాగే వర్షిత్ కాంస్య, వేదాన్ష్ కాంస్య పథకాలు సాధించడం జరిగింది. పథకాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను వారికి కోచింగ్ ఇచ్చిన మాస్టర్ అన్నపూర్ణ ను స్పార్క్ అకాడమీ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ ఎంఏ హమీద్,ప్రెసిడెంట్ రాజేశం మాస్టర్, యాకుబ్ మాస్టర్ వడ్నాల శ్రీనివాస్ మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

## కొండాపూర్ గ్రామ సర్పంచ్ బరిలో యువకుడు మార్కరాజు

**సర్పంచ్‌గా గెలిపిస్తే ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతా**

**సమస్యలను తీర్చేందుకు పూర్తి హామీ**



హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 8 : కరీంనగర్ జిల్లా చిగురుమామి మండలం కొండాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మార్కరాజు బరిలో నిలుచున్నారు ఈ సందర్భంగా మార్కరాజు మాట్లాడుతూ కొండాపూర్ గ్రామం సమస్యల వలయంగా మారిపోయిందని తనను సర్పంచ్ గా గెలిపిస్తే కొండాపూర్ గ్రామాన్ని ఏ సమస్య లేకుండా తీర్చిదిద్దుతానని అంతేకాకుండా చాలా సంవత్సరాల నుంచి కొండాపూర్ గ్రామానికి గ్రామపంచాయతీ భవనం లేదని మొదటగా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని చేపడుతానని అంతేకాకుండా సంవత్సరంలోపు మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అత్యధిక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని మరియు గ్రామంలో పారిశుధ్య సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని అధిగమించేందుకు అధిక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తానని ఒకటవ వార్డ్ నుంచి గాంధీ చౌరస్తా వరకు సిసి రోడ్లు కరెంట్ పోల్లుమరియు కరెంట్ స్తంభాలు ఇంటి ముందట ఇంటికి అడ్డంగా ఉన్నా వాటిని తీయించి దూరంగా కొత్త వాటిని వేయిస్తానని మరియు ఎల్లప్పుడూ స్థానికులకు అందుబాటులో ఉంటానని కొండాపూర్ చెరువు కట్టను సుందరీకరణ చేస్తానని దానిపై వాకింగ్ ట్రాక్ నిర్మిస్తానని అన్ని వాటిలో ఏ సమస్య లేకుండా ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కొండాపూర్ గ్రామాన్ని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతానని కత్తెర గుర్తుపై ఓటు వేసి మార్కరాజు అని నన్ను సర్పంచ్గా గెలిపిస్తే ఊరిని అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని ప్రజలు ఏ సమయంలోనైనా నా తలుపు తడితే వారికి అందుబాటులను ఉంటారని తెలియజేశారు.





## మతాల మధ్య వారధి... “మసీదు సందర్శనకు రండి”

రామకృష్ణాపూర్ డిసెంబర్ 7 (వాయిస్ టుడే): మంచిర్యాల్ జిల్లా జమీయతే అహ్లే హదీస్ కమిటీ ఆధ్వర్యంలో “మా మసీదు సందర్శనకు రండి” అనే శాంతి%-%సామరస్య కార్యక్రమాన్ని బీ%-%జోన్‌లోని మస్జిదే మహమ్మదీయా మసీదులో ఆదివారం నిర్వహించారు. సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించడం, పరస్పర అవగాహనను పెంపొందించడం, అన్ని మతాల మధ్య సోదరభావాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని కమిటీ నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమానికి హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాల నుంచి సుమారు 300 మందికి పైగా మహిళలు పురుషులు హాజరయ్యారు. సమాజంలోని చెడు రుగ్మతలు, భేదాభిప్రాయాలు, విభేదాలను తొలగించి మనమంతా దేశ అభివృద్ధి కోసం ఒకటిగా ముందుకు సాగాలనే సంకల్పాన్ని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. మతాల మధ్య అవగాహన పెరిగితేనే నిజమైన సామరస్య సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు ,యూసుఫ్ పాషా, మరమహమ్మద్ రషీద్ పాషా, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మహత్యలు వద్దు పోరాడి హక్కులు సాధించుకుందాం

**బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు**

**ధూళిపాల శ్రీనివాసరావు**

హుజూర్ నగర్ డిసెంబర్ 07 (వాయిస్ టుడే ప్రతినిధి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపరిచే విషయంలోఅన్యాయం జరిగిందని నిప్పంటించుకొని హైదరాబాదులో ఆత్మహత్యకి పాల్పడిన ఈశ్వర చారిని స్మరిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హుజూర్ నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఇందిర చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ధూళిపాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల కోసం తన ప్రాణాలర్పించిన ఈశ్వర్ చారి ప్రతి బీసీ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆత్మహత్యలు వద్దని పోరాడి బీసీ హక్కులు సాధించుకుందాం అన్నారు.ఆయన ప్రాణ త్యాగాన్ని గుర్తించి ప్రభుత్వం వారి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బీసీ ఉద్యమం ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వం గుర్తించాలన్నారు.బీసీ రిజర్వేషన్ కోసం తన ప్రాణాలర్పించిన ఈశ్వర చారి కి జాతీయ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ నుండి నివాళులర్పిస్తు వారి కుటుంబానికి ఆయన సానుభూతి తెలియజేశారు. భవిష్యత్తులో ఎవరు కూడా ఇటువంటి నిర్ణయాలు తీసుకోకూడదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు, లక్కవరం గ్రామ అధ్యక్షులు ఓరుగంటి మధు, చేపూరి నరసింహ చారి, చిలక రాజ్ అజయ్ కుమార్, కర్నే కృష్ణ, శెట్టి శ్రీనివాస్, వట్టికూటి శ్రీనివాస్ గౌడ్, కొట్టు శేఖర్, ఎస్.కె.హసన్మియా, జి సైదులు యాదవ్, కాలువ పెద్ద వెంకటేశ్వరావు బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎస్టీ చెక్ పోస్ట్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 07 : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యం లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, వాహనాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.



## ఏకగ్రీవంగా ఎన్నికైన నూతనంగా సర్పంచ్లను సన్మానం చేసిన తెలంగాణ సిట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి

ఝరాసంగం డిసెంబర్ 07 (వాయిస్ టుడే): ఝరాసంగం మండలం చిల్లపల్లి సర్పంచ్ గా మల్ రెడ్డి చిల్లపల్లి తండా సర్పంచ్ గా ప్రేమ్ సింగ్. వార్డ్ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ నందారం గిరిధర్ రెడ్డి గారు రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు అలాగే ఏకగ్రీవంగా సర్పంచ్లను ఎన్నిక చేసినటువంటి మాజీ ఎంపీటీసీ హఫీజ్. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అశ్విని పటేల్ . ఆరిఫ్. సద్దాం. జాఫర్.యునుస్. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అల్ట్రా మారథాన్ రన్‌లో పాల్గొన్న రాజన్న సిరిసిల్ల జిల్లా వాసి




రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 07 : రాజస్థాన్ – జైసల్మేర్ నుండి లాంగెవాలా వరకు నిర్వహించిన ది బోర్డర్ రన్ 2025” 100 కిలోమీటర్ల అంతర్జాతీయ ప్రమాణాల అల్ట్రా మారథాన్ రన్‌లో పాల్గొన్న రాజన్న సిరిసిల్ల జిల్లా కు చెందిన ఆర్ముడ్ రిజర్వ్ కానిస్టేబుల్ అనిల్ యాదవ్. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎడారి ప్రాంతంలోని వేడి%-%చలి తీవ్రత, ఎత్తైన ఇసుక టేకులు వంటి సవాళ్ల మధ్య 100 కిలోమీటర్ల పొడవున సాగిన ఈ రన్‌లో పాల్గొని 14 గంటల్లో పూర్తి చేసి కానిస్టేబుల్ అనిల్ యాదవ్ అపారమైన ధైర్యసాహసాలు, శారీరక%-%మానసిక దృఢతను ప్రదర్శించారు. ప్రజాసేవలో ఉంటూనే ఇటువంటి అల్ట్రా మారథాన్ ఈవెంట్లలో పాల్గొనడం ద్వారా ఫోర్స్‌లోని యువ సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన అనిల్ కు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్, జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి పోటీలలో ప్రావీణ్యం సంపాదించి జిల్లా,రాష్ట్ర, దేశ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
సోమవారం 8 డిసెంబరు 2025



## సముద్రాల గ్రామ సర్పంచ్ బరిలో యువకుడు ఉత్సాహవంతుడు చాడ శ్రీనివాస్ రెడ్డి

**నిస్వార్ధపరుడు సామాజిక సేవకుడు**

**ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేనాయకుడు**

హుస్నాబాద్ , వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 7 : సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామ సర్పంచ్ బరిలో యువకుడు ఉత్సాహవంతుడు నిస్వార్ధపరుడు చాడా శ్రీనివాసరెడ్డి బరిలో నిలిచారు ఈ సందర్భంగా చాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సముద్రాల గ్రామం సమస్యల నిలయంగా ఉందని వారిని పరిష్కరించే దిశగా తన ప్రయత్నం చేస్తున్నానని ఈ సందర్భంలో వచ్చిన సర్పంచ్ ఎన్నికలలో తన పోటీ చేస్తున్నానని ఈ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు తాను గతంలో పెరుమళ్ళ బండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర వహించానని అక్రమంగా బండ కొట్టే విషయంలో గ్రానైట్ తరలించడం లాంటి విషయాలపై నివారణ చర్యలు చేపడతానని తెలియజేశారు అంతేకాకుండా దేవస్థానానికి బోరు వేయించడంలో నేను కీలకపాత్ర పోషించానని తెలిపారు గ్రామపంచాయతీ కొత్త భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేయడంలో నేనే కీలకపాత్ర వహించానని తెలియజేశారు. గాండ్లోని కుంట కబ్జాకు గురికాకుండా నా వంతు ప్రయత్నం నేను చేశానని సముద్రాల గ్రామంలో మంచినీటి సమస్య వస్తే రోడ్డుపై ధర్నా చేసి 24 గంటల్లో మంచినీటి సమస్యలు తీర్చేందుకు నా వంతు ప్రయత్నం చేశానని పాఠశాల అభివృద్ధికి అందర్నీ ఒప్పించి దాదాపు 30 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా తాను ప్రోత్సహించానని తెలిపారు అంతేకాకుండా గ్రామంలోని అందరికీ సీఎం రిలీఫ్ ఫండ్లు కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సాయం చేయించడంలో నేను కీలకపాత్ర వహించానని ఈ ఒక్కసారి నన్ను సర్పంచ్ గా గెలిపిస్తే మిగిలిన పనులను చేసి సముద్రాల గ్రామాన్ని సిద్దిపేట జిల్లాలోని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని నేను మీ సేవకుడను 24 గంటలు అందుబాటులో ఉంటానని మీ బిడ్డగా పనిచేస్తానని పొలాలకు వెళ్లడానికి రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని వారికి కల్వర్టు ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో మీ బిడ్డ చాడా శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

## బంజరు పల్లె సర్పంచ్ బరిలో రిక్కల లతా రాజిరెడ్డి

**ప్రజా సమస్యలపై అవగాహన నిత్యం ప్రజలతో సావాసం ..**

**సర్పంచ్ గా గెలిపిస్తే ప్రజల ఆడబిడ్డగా పనిచేస్తా ..**



హుస్నాబాద్ (వాయిస్ టుడే ప్రతినిధి) డిసెంబర్ 7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని బంజరు పల్లె సర్పంచ్ అభ్యర్థిగా రిక్కల లతా రాజిరెడ్డి అభ్యర్థిగా ముందుకు వస్తున్నారు. వీరు గతంలో బంజర పల్లె గ్రామంలో సామాజికంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినారు. ప్రభుత్వం ఉన్నా లేకున్నా ప్రజల్లో ఒకడిగా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు గ్రామంలో స్కూలు యొక్క స్థితిగతులను మార్చారు అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం స్కూల్ అభివృద్ధి మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో చేపట్టడం జరిగింది. అయితే లతా రాజిరెడ్డిని సర్పంచ్ గా గెలిపిస్తే వారు బంజరపల్లి గ్రామానికి బంజరి పల్లె రోడ్డు నుండి ఊరి వరకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు మరియు రోడ్ నుండి లోపలి వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తానని అంతేకాకుండా స్కూల్ యొక్క స్థితిగతులను మార్చి పిల్లలను ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాల వెళ్లే విధంగా గ్రామాన్ని తీర్చిదిద్దుతానని బతుకమ్మ ఘాటును ఏర్పాటు చేసి మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి అనువుగా ఘాటును తీర్చిదిద్దానని ఊరి చెరువును మరమ్మతులు చేస్తానని అంతేకాకుండా మహిళలకు మహిళా సంఘం భవనము కమ్యూనిటీ భవనము కమ్యూనిటీ హాల నిర్మాణము చేస్తానని ఒక మహిళగా ఒక ఇంటిని చక్కదిద్దే వ్యక్తిగా ఊరుని గ్రామాన్ని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దడంలో నా వంతు పాత్ర నిర్వహి స్తానని. అంతేకాకుండా బంజర పల్లె గ్రామాన్ని ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ 24 గంటల్లో అందుబాటులో ఉంటానని బంజరుపల్లి గ్రామాన్ని సిద్దిపేట జిల్లాలో ఆదర్శ గ్రామంగా తీర్చితే బాధ్యత నాది అని ఈ సందర్భంగా లతా రాజిరెడ్డి తెలిపారు. తమకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి ఊరును అభివృద్ధి దిశగా పయనించుటలో ప్రజలు అధిక సంఖ్యలో తమ మద్దతు తెలిపాలని కోరారు.



## చర్ల-దుమ్ముగూడెం మండలాల్లో ఎన్నికల వ్యయ పరిశీలకులు లావణ్య పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 7: ఎన్నికల వ్యయ నియంత్రణలో భాగంగా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ లావణ్య , ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్ ఏ.వీ. రెడ్డి ఆదివారం దుమ్ముగూడెం చర్ల మండలాల్లో పర్యటనలు నిర్వహించారు. ముందుగా అధికారులు దుమ్ముగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో) కార్యాలయాన్ని సందర్శించి, పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, ఎన్నికల వ్యయ నమోదు రిజిస్టర్లు, షాడో రిజిస్టర్, రసీదులు లావాదేవీల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. వ్యయ పరిమితుల అమలు, పత్రాల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శక విధానాలపై సంబంధిత సిబ్బందికి సూచనలు అందజేశారు. తరువాత అధికారులు చర్ల మండలంలో కూడా వ్యయ రికార్డులను పరిశీలించి, అనంతరం పోటీ చేస్తున్న అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు ఎన్నికల వ్యయ నియమావళిని కచ్చితంగా పాటించాలని, ప్రతి ఖర్చు లావాదేవీని తగిన ఆధారాలతో నమోదు చేయాలని, సమయానుసారంగా రిపోర్టులు సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, ఏవైనా లోపాలు ఉన్న పక్షంలో తక్షణమే సరిదిద్దాలని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ టీములు, ఎంపీడీవో సిబ్బంది సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు.





# వాసవి క్లబ్ సేవాపురస్కారాలు

తొర్రూరు, డిసెంబర్ 7 వాయిస్ టుడే : తొర్రూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం వాసవి క్లబ్బులు చేసిన సేవా కార్యక్రమాలకు గాను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో రీజియన్ శ్రీ మచ్చ సోమయ్య, రీజియన్ 2 బీజ్జాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ సేవా పురస్కారాలు కార్యక్రమం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ కె సి జి ఎఫ్ ట్రెజరర్ మేడిశెట్టి రామకృష్ణ, ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరీ కల్వ హరికృష్ణ,లు హాజరు కాగా కార్యక్రమంలో అతిథులుగా వాసవి క్లబ్ రికాన్ అబ్జర్వర్ రామా ఉపేందర్, రికాన్ అబ్జర్వర్ ప్రొద్దుటూరి గౌరీ శంకర్, జిల్లా జాయింట్ సెక్రెటరీ సామ రామ్మూర్తి, రీజియన్ సెక్రటరీ మంచినీళ్ల నవీన్ కుమార్, జోన్ చైర్మన్ కొమరవెల్లి లింగమూర్తి, జోన్ చైర్మన్ ఎం మోహన్ రావు, జోన్స్ చైర్మన్ దాస సాయి తేజ, వదిన పెల్లి అనిల్ కుమార్ దీప, మచ్చ సురేష్, దారం గాయత్రి పాల్గొన్న కార్యక్రమంలో 2025 వాసవి క్లబ్ లకు చేసిన సేవలకు అవార్డులు ఇచ్చినారు. కార్యక్రమంలో వాసవి మాత చిత్రపటం దగ్గర జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొర్రూరు వాసవి క్లబ్ అధ్యక్షులు చిదిరాల నవీన్ కుమార్ జాతీయ జెండా తో మార్చ్ ఫాస్ట్ అతిథులకు జాతీయ జెండాను అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొర్రూర్ వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ వాసవి చత్రపతి శివాజీ యూత్ క్లబ్ తొరూర్ ఆధ్వర్యంలో చిత్రాల నవీన్ కుమార్ చేసిన సేవా కార్యక్రమాలకు అవార్డుల ను అందించినారు. చాంబర్ ఆఫ్ కామర్స్ లో జరిగిన వాసవి క్లబ్ సేవా పురస్కారాలకు వాసవి క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులో వాసవి క్లబ్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని కోరినారు. కార్యక్రమంలో తొర్రూర్ సీనియర్ సిటిజన్ వాసవి క్లబ్ ను నూతనంగా ఏర్పాటు చేసినారు. క్లబ్బుకు నూతన అధ్యక్షులుగా బిజ్జాల. వెంకటరమణ, కోశాధికారిగా కే .చంద్రయ్య లు పదవి ప్రమాణ స్వీకారం చేసినారు. కార్యక్రమం లో వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాంబాబు కోశాధికారి గోపారపు నిరంజన్, వాసవి వనిత క్లబ్స్ అధ్యక్షురాలు చిధిరాల గీత, చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు చిదిరాల నిఖిల్ , ప్రధాన కార్యదర్శి కందుకూరి అఖిల్, వాసవి క్లబ్ సభ్యులు చౌడవరపు రాము చిదిరాల రవి , ప్రతాపని వెంకటేశ్వర్లు,మాడుగుల.రామ్మూర్తి,జి.రమేష్,టీచర్,చిత్రపు.పురుషోత్తం,మహంకాళి.వెంకటేశ్వర్లు, మొదలగు వారు పాల్గొన్నారు.



## తొర్రూరులో ఘనంగా అయ్యప్ప కన్నిస్వాముల పూజ

**మూడు దశాబ్దాలుగాప్రత్యేక పూజా నిర్వహణ**

**అయ్యప్ప శరణు ఘోషతో మారుమోగిన తొర్రూరు పట్టణం**

తొర్రూరు, డిసెంబర్ 7 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓంకార నిలయ ప్రాంగణంలో నెలకొని ఉన్న అయ్యప్ప మందిరం వద్ద ఆదివారం ఆలయ అర్చకులు రేణుకుంట్ల శివ గురుస్వామి ఆధ్వర్యంలో సామూహిక కన్నీస్వాముల పూజను ఘనంగా నిర్వహించారు .ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి అనంతరం సీనియర్ గురుస్వామి 40 సార్లు మాల ధారణ చేసిన సీనియర్ గురుస్వామి మాజేటి నరసింహరావు చే మొదటిసారి మాల ధారణ చేసిన కన్ని స్వాములతో సామూహిక పూజను నిర్వహించారు. హరిహర సుతుడు, మణికంఠునికి మొదటిసారి మాల ధారణ చేసిన అయ్యప్ప కన్నీస్వాములు నియమనిష్టలతో పూజా కార్యక్రమాలను 40 రోజులపాటు నిర్వహించుకుని శబరిమల కి వెళ్లి నీలిమలై వద్ద శరం ను గుచ్చుతారని ఇది అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని మకర సంక్రాంతి రోజున ఆ మణికంఠుని పందల రాజు చేయించిన స్వర్ణభరములను అయ్యప్పకు అలంకరించి శరంగుర్తి వరకు తీసుకు వస్తారని ఇందుకు కారణం మహిషి తనను వివాహమాడాలని అయ్యప్పని కోరిందని అప్పుడు అయ్యప్ప మనిషికి ఒక అవకాశం ఇస్తాడని ఏ సంవత్సరం అయితే మొదటిసారి మాల వేసిన కన్ని స్వామి శబరిమలకే రాకుండా ఉంటాడో అప్పుడు నిన్ను వివాహమాడుతాడని అభయమిస్తాడని అందుకే సమయం ప్రతి సంవత్సరం మకర సంక్రాంతి రోజున పందాల రాజు చేయించిన స్వర్ణభములను అలంకరించి శరంగుర్తి వరకు తీసుకువచ్చి శరములను చూసి వారికి అభయమిస్తాడని అప్పుడు మహిషి కూడా నిరాశ చెందుతుందని చెప్పారు. అందుకోసమే మొదటిసారి మాల వేసిన స్వాములు అంటే అయ్యప్పకు ఎంతో ఇష్టమని ఈ పూజను ఉభయ తెలుగు రాష్ట్రాలలో గత 29 సంవత్సరాలుగా మొదటిసారిగా తొర్రూరులోని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆలయ అర్చకులు రేణుకుంట్ల శివ గురుస్వామి మాట్లాడుతూ తొర్రూర్ ప్రాంతంలో గత 29 ఏళ్లుగా భక్తుల సహకారంతో ఈ యొక్క పూజను నిర్వహించడం జరుగుతుందని, నియమనిష్ఠలతో దీక్ష పూర్తి చేసుకుని శబరిమలై లో పదునెట్టాంబడి ఎక్కి నియాభిషేకం చేయించి ఇంటికి వచ్చి మాల విసర్జన చేసిన వారికి అయ్యప్పను భక్తితో కొలిచిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఆ శబరీషుని అనుగ్రహం ఉంటుందని చెప్పారు . ఆదివారం రోజున నిర్వహించిన ఈ పూజలో స్వామి వారి సహస్రనామార్చన అష్టోత్తరం, వనయాత్రలో అయ్యప్ప భక్తులు చూడాల్సిన ప్రదేశాలు వ్రత మహిమ శబరిమల యాత్ర విశేషాలను కనులకు కట్టినట్లు తెలిపారు. పుష్పాభిషేకం పంచామృతాభిషేకం, పడి పూజ అరివైన పాయసం మహా ప్రసాదం నివేదన అనంతరం భక్తుల సహకారంతో మహాన్నప్రసాద కార్యక్రమాన్ని వితరణ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వాములు, మాలవేసిన భక్తులు వేలాదిమందిగా పాల్గొన్నారు.

## కవితా గానంతో రాష్ట్రస్థాయి వేదికపై మద్దెల సుధాకర్‌కు ప్రత్యేక గుర్తింపు



పెద్దవంగర, డిసెంబర్ 8 : కవితా గానంతో రాష్ట్రస్థాయి వేదికపై ప్రత్యేక గుర్తింపు పొందాడు. సూర్యాపేటలో జరిగిన కవి సమ్మేళనంలో అతని భావపూర్వక ప్రదర్శనకు ప్రశంసలు వెల్లువెత్తాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో పెద్దవంగర మండల కేంద్రంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మద్దెల సుధాకర్ తన కళాత్మక ప్రతిభతో ప్రేక్షకులను అలరించాడు. వేదికపై భావపూర్వకంగా కవితా గానం చేసిన సుధాకర్ ప్రదర్శనకు కవులు, ప్రేక్షకుల నుంచి ఘన స్పందన లభించింది. అతని ప్రతిభను మెచ్చిన శ్రీశ్రీ కళావేదిక సంస్థ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను అందజేసి, శాలువాలతో సన్మానించారు.



## అలరించిన భలే మంచి రోజు

ఖమ్మం : అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని పురస్కరించుకొని సుధాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సునాదవినోదిని సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'భలే మంచి రోజు' ప్రేక్షకులను అలరించింది. ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, 'భలే మంచి రోజు' కన్వీనర్ పంచాంగం విజయసారథి చిత్రపటాలకు అతిథులు, నిర్వాహకులు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ విశ్రాంత ఐఏఎస్ అధికారి హెచ్.అరుణ్‌కుమార్ మాట్లాడారు. 29 ఏళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఖమ్మం ప్రజలు, అభిమానులను ఘంటసాల మధుర గీతాలతో అలరించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం బాల్య మిత్రుడు మురళి, సాహిత్య విశ్లేషకుడు శేషబాబు, ఆత్మీయ అతిథులు గుత్తేదారు మహమ్మద్ అజీజ్, ఏపీజీవీబీ విశ్రాంత అధికారి మహమ్మద్ జాన్‌సాహెబ్, కాళ్ల గ్రూప్స్ ఎండీ పాపారావు, సీనియర్ అడ్వకేట్ రమేశ్, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డా.రవి, భలే మంచి రోజు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.టి.వాసుదేవ్, శఠగోపం సుదర్శన్ పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

**నియమావళి ఉల్లంఘనపై కఠిన చర్యలు**

**సోషల్ మీడియా పుకార్లపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ కృష్ణకిషోర్**



పెద్దవంగర, డిసెంబర్ 8: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి,భద్రతలకు భంగం కలిగితే కఠిన చర్యలు తప్పవని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఒక కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచ్ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై ప్రమోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాట్లాడిన డీఎస్పీ కృష్ణకిషోర్, ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో జరగాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు, గుంపులు, ఉద్రిక్తతలకు దారితీసే చర్యలు ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, ఇటువంటి ఘటనలపై వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో నిర్ధారణ లేని సమాచారం, పుకార్లు పంచడం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఓటర్లు భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి పార్టీ నాయకులు పోలీసు విభాగానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ గణేష్, ఏఎస్సై హిదాయత్‌అలి, పోలీసు సిబ్బంది, అభ్యర్థులు మరియు వివిధ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.